


శుభకార్యాలు.. ప్రచారాలు..
అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. శుభకార్యాలకూ హాజరవుతు ఓట్లడుగుతున్నారు.
- 10లో ▸

దక్షిణ బద్రీనాథ్..
రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన భీమ్‌గల్ లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.
- 10లో ▸



వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.3 /18.3
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గల్ఫ్ కార్మికులకు బీమా హామీ వెనుక మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గల్ఫ్ కార్మికులకు రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ గురువారం నిజామాబాద్ రూరల్ సభలో హామీ ఇవ్వడం వెనుక మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి, చొరవ ఉంది. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంగనర్, నిర్మల్ జిల్లాల్లో ఎక్కువగా గల్ఫ్ కార్మికులు ఉన్నారు. దీంతో గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అనేక డిమాండ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో గల్ఫ్ జేఏసీ నాయకులు, కార్మికులతో పలు విడతలుగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై అధ్యయనం చేస్తూ వస్తున్నారు. తా జాగా ఈ విషయమై మంత్రి ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్‌తో ప్రత్యేకంగా ప్రస్తావించి గల్ఫ్ కార్మికులకు బీమాను వర్తింపజేసే విషయంలో విజయం సాధించారు. గల్ఫ్ కార్మికుల ఇతర సమస్యల విషయమై తగిన పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తానని మంత్రి చెబుతున్నారు.

కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

- 2,33,855 మెట్రిక్ టన్నులు సేకరణ

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు శరవేగంగా సాగుతున్నాయి. 440 కేంద్రాల ద్వారా 34,525 మంది నుంచి 2,33,855 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. రోజుకు సగటున 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు 14,532 మంది రైతులకు రూ.225.87 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, వెంటనే సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జగదీశ్‌కుమార్ తెలిపారు.

పూర్తయిన ర్యాండమైజేషన్



సుభాష్‌నగర్ : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా గురువారం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకులు, ఐఏఎస్‌లు ఎం సుబ్రా చక్రవర్తి, లలిత్ నారాయణ్ సింగ్ సందు, గౌతమ్ సింగ్ ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఆరు సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 1549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 7,131 మందిని పోలింగ్ విధుల కోసం నియమించామని తెలిపారు. 20 శాతం రిజర్వ్‌లో ఉన్నారన్నారు మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సీపీవో బాబూరావు, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అర్బన్‌కు సంబంధించి గురువారం సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తిచేశారు. అర్బన్ సెగ్మెంట్ నుంచి 21 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో అదనపు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అర్బన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం మకరందు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి మండలంలోని గాంధీనగర్ వద్ద ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

58 ఏళ్ల గోస మరువొద్దు

- కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపాలి
- ఏ పార్టీకి ఓటు వేయాలో గ్రామాల్లో చర్చ పెట్టాలి
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : 58 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నో గోసలు పడ్డాం. బలవంతంగా మనల్ని ఆంధ్రాలో కలిపింద్రు. ఎన్నో పోరాటాల అనంతరం మన రాష్ట్రం దేశంలోనే నంబవర్‌వన్‌గా ఉంది' అని సీఎం కేసీఆర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిందెవరో విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలని ప్రజకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు, వాళ్ల వెనక ఉన్న పార్టీల చరిత్ర చూడాలన్నారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నాం. మిషన్ భగీరథ పథకంతో మంచినీళ్ల గోస తప్పిందన్నారు. మిషన్ కాకతీయతో చెరువులను బాగు చేసుకున్నామన్నారు. తెలంగాణ రాక ముందు తలసరి ఆదాయంలో 18వ స్థానంలో ఉన్న మనం తెలంగాణ వచ్చిన తర్వాత ఇప్పుడు ఒకటవ స్థానంలో నిలిచామన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతాం..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని రాహుల్ గాంధీ అంటున్నారు. అలాంటి కాంగ్రెస్‌ను మనం ఓటుతో బంగాళాఖాతంలో కలపాలలని సీఎం పిలుపునిచ్చారు. ధరణి పోర్టల్‌లో మీ బొటనవేలు పెడితే తప్పా మీ భూమి రిజిస్ట్రేషన్ కాదు. ధరణి పోతే రైతుబంధు రాదు. దళారులు మోపైతారన్నారు. సీఎంకు కూడా మీ భూమి తీసుకునే హక్కులేదు.. ధరణిలో సమస్యలను పరిష్కరిస్తామని, 3 గంటల కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు చెబుతున్నాడు.. పది హెచ్‌పీ మోటార్లు పెట్టాలంటున్నాడు. రాష్ట్రంలో 30 లక్షల బోర్లకు రూ. 30 వేల కోట్లు ఖర్చు చేయాలి.. వాళ్ల అయ్య కొనిస్తడా అంటూ కేసీఆర్ మండిపడ్డారు. రైతు బంధును క్రమక్రమంగా పెంచుతామన్నారు. రైతుబంధు ఉండాల వద్దా.. అంటూ కేసీఆర్ అడుగగా ప్రజలు కావాలని నినదించారు. పింఛన్లు తీసుకుంటున్న వారంతా పేదలేనన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ రూ. 2 వేలను రూ.5 వేలకు పెంచుతామన్నారు. గల్ఫ్‌లో ఉన్న కార్మికులకు కూడా బీమా వర్తింపజేస్తామన్నారు.

ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలి..

రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా రైతు బాగుండాలని రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ అమలు చేశామన్నారు. వ్యవసాయ స్థిరీకరణ చేసి, నీటిపన్ను రద్దు చేశామన్నారు. దేశంలో 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణానేన్నారు. గతంలో ఉన్న రూ. 200 పింఛన్‌ను ప్రస్తుతం 2000కు పెంచామన్నారు. ఐటీలో త్వరలోనే బెంగుళూరును దాటేస్తామన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నారని, బీడీకార్మికులకు పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ పేషంట్లకు రూ. 2వేలు పింఛన్ అందిస్తున్నామన్నారు.

మంచిప్ప నిర్వాసితులకు మంచి పరిహారం..

మంచిప్ప రిజర్వాయర్ త్వరలోనే పూర్తవుతుందని, ఇజ్రాయిల్ టెక్నాలజీ ద్వారా ప్రతి మూడు ఎకరాలకు పైప్‌లైన్ ద్వారా సాగు నీటిని అందిస్తామని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రాజెక్టు కింద నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల పంట భూములకు సాగునీరందుతుందన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు మంచి పరిహారం ఇస్తామన్నారు.

3 వేల ఎకరాల పోడుభూమి పంపిణీ

రూరల్ నియోజకవర్గంలో గిరిజనులు (లంబాడాలు) అధికంగా ఉన్నారని కేసీఆర్ అన్నారు. 50 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చామని, వాళ్ల పాలన వాళ్లే చేసుకుంటున్నారన్నారు. 3 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశామని, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చెప్పినట్లు మిగిలిపోయిన కొంతమందికి ప్రభుత్వం రాగానే పట్టాలు అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనచారి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి వీజీగౌడ్, ఐసీడీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, సుమలత గోపాల్‌రెడ్డి, పి.తనూజ శ్రీనివాస్‌రెడ్డి, కమలనరేష్, ఎంపీపీలు రమేష్‌నాయక్, లత కన్నీరాం, కుంచాల విమలరాజు, అనుష ప్రేమ్‌దాస్, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ మంజుల యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రావు, పార్టీ నాయకులు నరాల సుధాకర్ తదితరులున్నారు.



బాజిరెడ్డి అడిగినవన్నీ నెరవేరుస్తా..

మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూరల్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి అడిగినవన్నీ తప్పకుండా నెరవేరుస్తానని సీఎం హామీ ఇచ్చారు. బాజిరెడ్డి ప్రజాసమస్యలపై నిరంతరం శ్రమించే మంచి నాయకుడన్నారు. ఇక్కడ బాజిరెడ్డిని గెలిపిస్తే అక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు.



బాజిరెడ్డిని ఎత్తుకుని నినాదాలు చేస్తున్న నాయకులు



బంజారా పాటలకు నృత్యం చేస్తున్న నాయకులు

సీఎం సభ సైడ్‌లైట్స్

- 4.16 గంటలకు గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన సభాస్థలికి సీఎం హెలికాప్టర్ చేరుకుంది.
- సీఎం కేసీఆర్‌కు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ స్వాగతం పలికారు.
- 4.25కు సీఎం కేసీఆర్ వేదికపైకి చేరుకున్నారు.
- 4.34 గంటలకు సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 4.57గంటలకు కేసీఆర్ ప్రసంగాన్ని ముగించారు.
- 5.05 గంటలకు సీఎం హెలీకాప్టర్ బయలుదేరింది.
- సీఎం రాకముందు రెండు గంటల పాటు కళాకారుల బృందం పాడిన పాటలు కార్యకర్తలను అలరించాయి.
- గాయని వీణ పాడిన రామక్క.. గులాబీ జెండాలో.. పాటకు కార్యకర్తలు ఉత్సహంగా నృత్యాలు చేశారు.
- గాయని రోహిణి లంబాడీ భాషలో పాడిన పాటలకు గిరిజనులు నృత్యాలు చేశారు.

– నిజామాబాద్ రూరల్



సభలో నృత్యం చేస్తున్న బాలికలు



సభావేదికపై ఆసీనులైన ఎంపీ సురేశ్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, జెడ్పీటీసీ జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులు

ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయండి

- పదివేల మందికి గృహలక్ష్మి ఇవ్వండి..
- జక్రాన్‌పల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి
- మంచిప్ప నిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలి
- సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ వినతి



సీఎం సభలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్ : జిల్లాలోని డిచ్‌పల్లి మండలంలో తెలంగాణ యూనివర్సిటీ ఉందని, జిల్లా వాసుల కోరిక మేరకు ఒక ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజ్ ను మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విన్నవించారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల కోసం రాత్రింబవళ్లు ఎండనక, వాననక కష్టపడుతున్నానని, సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మూడవ సారి తనకు బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని బాజిరెడ్డి కోరారు. రూరల్‌లోని గుండారం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. డిచ్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సిరికొండలో ఐటీఐ, ధర్పల్లిలో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆస్పత్రికి అనుబంధంగా నర్సింగ్ కాలేజ్‌తో పాటు పాలిటెక్నిక్ కాలేజ్‌ను మంజూరు చేయాలన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి సాధ్యపడిందని, రూరల్ నియోజకవర్గంలో గిరిజనులకు 3 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇంకా కొంతమంది మిగిలిపోయారని వారికి కూడా పట్టాలు ఇవ్వాలన్నారు. రూరల్‌లో గిరిజనులు అధికంగా ఉన్నారని వారికి ఏదైనా రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వాలని సీఎంకు విన్నవించారు. నియోజకవర్గంలో 50 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారి ఉందన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు నిర్మించాలన్నారు. నియోజకవర్గంలో పసుపు, వరి పంట అధికంగా సాగువుతాయని, నిరుద్యోగులకు ఉపాధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు వల్ల ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ప్యాకేజీ 21 పనుల్లో భాగంగా 4 పంపుహౌజ్ పనులు వేగవంతం చేయాలన్నారు. మంచిప్ప ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారాన్ని పెంచివ్వాలని, 3 వేల మందికి గృహలక్ష్మి పథకం మంజూరు చేశామని, పేదలు ఎక్కువగా ఉన్నందున 10 వేల మందికి ఈ పథకం మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు బాజిరెడ్డి విన్నవించారు.

ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

సుభాష్‌నగర్ : జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు చేసుకుని కార్డు రాని వారికి గుర్తింపు కార్డులు పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేయనున్నారు. కార్డులను డౌన్‌లోడ్ చేసి ఓటర్లకు అందించనున్నారు. మొత్తం 1,00,501 మందికి ఎలక్షన్ ఫొటో గుర్తింపు కార్డుతోపాటు ఓటుహక్కు వినియోగించుకోవాలనే సందేశం, ప్రతిజ్ఞతో కూడిన లేఖను నేరుగా ఇంటికి పంపించనున్నారు. పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం విస్తృతంగా చేపడుతున్న కార్యక్రమాల్లోభాగంగా తపాలాశాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

నియోజకవర్గం	కార్డుల సంఖ్య
ఆర్మూర్	14,451
బోధన్	16,665
బాన్సువాడ	11,630
అర్బన్	33,333
రూరల్	13,056
బాల్కొండ	11,366

పెరిగిన ఓటర్ల సంఖ్య 29,175

మోర్తాడ్(బాల్కొండ): సాధారణ ఎన్నికల సందర్భంగా కొత్త ఓటర్లకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడంతో జిల్లాలో కొత్త ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఓటర్ల జాబితా సవరించడానికి ముందు జిల్లాలో 13,65,811 మంది ఓటర్లు ఉంటే కొత్త దరఖాస్తుల స్వీకరణ, జాబితా సవరణ తరువాత 13,94,986 ఓటర్ల సంఖ్య చేరింది. 18 ఏళ్లు పైబడిన వారు, జాబితాల్లో గల్లంతైన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. అలాగే ఒక చోట నివాసం ఉంటూ మరో చోట ఓటు హక్కు ఉంటే అలాంటి వారు తాము ఉన్న చోటే ఓటు హక్కు వినియోగించుకోవడానికి బదలాయింపుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. సెప్టెంబర్‌లో జారీ చేసిన జాబితాకు, అక్టోబర్‌లో దరఖాస్తులు స్వీకరించి ఇటీవల వెల్లడించిన జాబితాను పరిశీలిస్తే జిల్లాలో 29,175 మంది ఓటర్ల సంఖ్య పెరిగిందని వెల్లడవుతోంది. ఓటర్ల సంఖ్య పెరగడం అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల కమిషన్ మాత్రం 18 ఏళ్ల వయస్సు పైబడినవారు అందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అందుకే కొత్త ఓటర్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు స్పెషల్ డ్రైవ్‌ను ఎన్నికల కమిషన్ నిర్వహించింది. ప్రతి ఏడాది జనవరిలోనే కొత్త ఓటర్లకు దరఖాస్తుల స్వీకరణ నిర్వహిస్తారు. ఈసారి ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత రెండుమార్లు జాబితా సవరణకు అవకాశం కల్పించడం విశేషం.

నియోజకవర్గాల వారీగా ఇలా..

నియోజకవర్గం	సవరణకు ముందు	తర్వాత	పెరిగిన ఓటర్లు
ఆర్మూర్	2,06,344	2,10,217	3,873
బోధన్	2,15,963	2,20,068	4,105
బాన్సువాడ	1,92,841	1,95,191	2,350
అర్బన్	2,86,766	2,94,832	8,066
రూరల్	2,48,269	2,53,233	4,964
బాల్కొండ	2,15,628	2,21,445	5,817
మొత్తం	13,65,811	13,94,986	29,715

క్లుప్తంగా

పోలింగ్‌ బూత్‌లకు ర్యాంపులు...



మోర్తాడ్‌: పోలింగ్‌బూత్‌ల వద్ద మెట్లు ఎక్కలేని వారి కోసం ఎన్నికల కమిషన్‌ ర్యాంపులను నిర్మిస్తోంది. 2014, 2018 ఎన్నికల్లో అనేక పోలింగ్‌ బూత్‌ల వద్ద వీటిని నిర్మించింది. ర్యాంపులు లేని చోట ఉపాధి నిధులతో కొత్తగా నిర్మిస్తోంది. గతంలో నిర్మించిన ర్యాంపులకు మరమ్మతులు ఉంటే సంబంధిత అధికారులు పూర్తి చేస్తున్నారు. జిల్లాలో 1,549 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయి. అన్ని పోలింగ్‌ బూత్‌లు పాఠశాలలు, గ్రామ పంచాయతీల్లో ఉన్నాయి. పోలింగ్‌ బూత్‌లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సంబంధిత అధికారులకు బాధ్యతలను అప్పగించింది. వారు పోలింగ్‌ కేంద్రాల్లో వీటి నిర్మాణం చేపడుతున్నారు.

19న మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ ఎంపికలు

కామారెడ్డి అర్బన్‌: జిల్లా మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 30 ఏళ్లు పైబడి ఆరోగ్యంగా ఉన్నవారికి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి డి.నరేశ్‌ గురువారం తెలిపారు. వంద మీటర్ల నుంచి ఐదువేల మీటర్ల వరకు పరుగు, నడక, లాంగ్‌ జంప్‌, హైజంప్‌, డిస్కస్‌త్రో, జవెలిన్‌ త్రో అంశాల్లో ఎంపికలుంటాయని పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే వారు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణపత్రం తీసుకురావాలని సూచించారు.

బడిమానేసిన విద్యార్థులపై శ్రద్ధ కనబర్చాలి



కామారెడ్డి అర్బన్‌: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువులో వెనుకబడ్డ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు కృషి చేయాలని డీఈవో రాజు అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్‌) విద్యార్థులకు 'హ్యాండ్‌ షేక్‌' కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు విద్యా ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్‌ కె.విజయ్‌కుమార్‌, తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ కె.కిష్టయ్య, అకడమిక్‌ సమన్వయకర్త వి.శంకర్‌, ఎంఈవో రామస్వామి, విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారులు శ్రీపతి, నాగవేందర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్‌గౌడ్‌, శారద, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలు.. ప్రచారాలు

- నేటి నుంచి మొదలు కానున్న వివాహాల జోరు





నిజామాబాద్‌ సిటీ: జిల్లాలో నామినేషన్ల ఘట్టం ముగిసింది. పార్టీల తరఫున అభ్యర్థులతో పాటు స్వతంత్రులు అధికంగానే బరిలో నిలిచారు. ఈ నెలా 30న ఓటింగ్‌ జరుగనున్న నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థులు ఓటర్లను తమదైన శైలిలో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన అభ్యర్థుల నుంచి స్వతంత్రుల వరకు నియోజకవర్గంలో ఎక్కడ ఏం జరిగినా అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. ఎవరైనా శుభకార్యాలకు పిలిస్తే చాలు వీలు కల్పించుకుని మరి వెళ్తున్నారు. ఇక ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను పరామర్శించి పాడె మోస్తున్నారు.

ప్రజలను ఆకట్టుకునేందుకు..

నేటినుంచి వివాహ వేడుకలు మొదలుకానున్నాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఈ నెల రోజుల్లో అధిక వివాహాలు జరగనున్నాయి. గతంలో వివాహ వేడుకలకు రావాలని కుటుంబ సభ్యులు శుభలేఖలు అందజేసినా ఆ వేడుకలకు వీలుంటేనే హాజరయ్యేవారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో వేడుకలకు చాలా మంది వస్తారు కాబట్టి వారిని ఆకట్టుకునేందుకు అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు శుభకార్యాలకు, మరోవైపు పరామర్శలకు వెళ్తూ నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నెలలో 16 నుంచి 29 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆ సమయంలోనే ప్రచారం హోరెత్తనుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ప్రతి ఒక్క అభ్యర్థి ఇంటింటికి వెళ్తూ వృద్ధులను, గ్రామస్తులను కలుస్తూ ఓటు తమకే వేయాలంటూ వేడుకుంటున్నారు. ఎన్నికలకు మరో 14రోజుల సమయం మాత్రమే ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభ్యర్థులు ఉదయం 8 గంటల్లోపే ప్రచారాన్ని ప్రారంభించి సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఏదేమైనా శుభకార్యాలు అభ్యర్థులకు కలిసొస్తున్నాయని చెప్పొచ్చు.

ఆర్మూర్‌లో ముక్కోణపు పోటీ

- జోరుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,10,217



ఆశన్నగారి జీవన్‌రెడ్డి | పైడి రాకేశ్‌రెడ్డి | పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి

జంగ్‌ తెలంగాణ

ఆర్మూర్‌: సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మూర్‌ నియోజకవర్గంలో ముక్కోణపు పోటీ నెలకొననుంది. నామినేషన్లు, ఉపసంహరణల అనంతరం 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కానీ ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి(బీఆర్‌ఎస్‌), పైడి రాకేశ్‌రెడ్డి (బీజేపీ), వినయ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్‌)ల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. పార్టీ అభ్యర్థిత్వం ముందుగానే ఖరారు కావడంతో జీవన్‌రెడ్డి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బీజేపీ శ్రేణులను ఏకం చేస్తూ ఇన్నేళ్లు నాయకత్వ లోపంతో పార్టీకి దూరంగా ఉన్న వారిని కలుపుకొంటూ రాకేశ్‌రెడ్డి సైతం ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. వినయ్‌ కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేపడుతున్నారు. మూడు జాతీయ పార్టీలైన బీఆర్‌ఎస్‌, బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీల మధ్యే ఈ పోటీ నెలకొందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఆర్మూర్‌ మున్సిపల్‌తో పాటు ఆర్మూర్‌, నందిపేట, మాక్లూర్‌, ఆలూర్‌, డొంకేశ్వర్‌ మండలాలు ఉన్నాయి.

నియోజకవర్గంలో 2,10,217 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 98,274, మహిళలు 1,11,937, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 2011 గణాంకాల ప్రకారం ఆర్మూర్‌ నియోజకవర్గ జనాభా 2,51,173 కాగా అందులో పురుషులు 1,21,628, మహిళలు 1,29,545 మంది ఉన్నారు. ఆర్మూర్‌ అసెంబ్లీకి 1952 నుంచి ప్రారంభిస్తే ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవాలనే లక్ష్యంతో అభ్యర్థులు ఒకరిని మించి ఒకరు ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు.

ఓటర్ల రుణం తీర్చుకుంటా

- బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పాత వర్నిలో మాట్లాడుతున్న పోచారం

వర్ని: తొమ్మిదిన్నర ఏళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని తగిలేపల్లి, పాత వర్ని, హమ్నపూర్‌, నెహ్రూనగర్‌, వకీల్‌ ఫారం, శ్రీనగర్‌ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ప్రజలు ఎన్నికల ప్రచారంలో కూడా తనకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రచారంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, ఉమ్మడి మండల ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కల్లాల్‌గిరి, మార్కెట్‌ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్‌, జెడ్పీటీసీ హరిదాసు, నాయకులు వీర్రాజు, నాగభూషణం, సర్పంచ్‌ వెంకటి, రాజు, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాని బాబు, గుజ్జ అశోక్‌, హనుమాన్లు, నగేశ్‌, రాం బాబు పాల్గొన్నారు.

బ్రూణ హత్యలను నివారిద్దాం



నిజామాబాద్‌నాగారం: ఆడపిల్లలను బ్రతకనిద్దామని, బ్రూణ హత్యలను నివారిద్దామని జిల్లా ఆరోగ్య విద్యా బోధకుడు ఘనపూర్‌ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని నాగారంలో ఉన్న గిరిజన మహిళా ప్రభుత్వ రెసిడెన్షియల్‌ డిగ్రీ కళాశాలలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేద చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ వివక్ష చూపకుండా పుట్టబోయే శిశువు ఆడైనా మగైనా అందరూ సమానమే అని అన్నారు. గర్భిణులకు స్కానింగ్‌ సెంటర్‌లో వైద్యులు లింగ నిర్ధారణ చేయరాదన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్యం, పోషకాహారం, రక్త హీనత, అయోడిన్‌ లోప రుగ్మతలు, పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ శైజాది జైనథ్‌, సునీత, సంగీత, ఆశా కార్యకర్త, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దక్షిణ బద్రి.. మన లింబాద్రి

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



గర్భగుడిలోని నృసింహుడు

భీమ్‌గల్‌: ఉత్తర తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన భీమ్‌గల్‌ నింబాచలం(లింబాద్రి గుట్ట) పై శ్రీమన్నింబాద్రి లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ప్రతీ ఏటా కార్తీక మాసంలో 11 రోజుల పాటు వైభవంగా కొనసాగుతాయి. ఉత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. శనివారం సాయంత్రం గ్రామాలయం నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తులు కొండపైకి మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నంబి లింబాద్రి తెలిపారు.

స్థల ప్రాశస్త్యం

నింబాచలం అంటే వేప చెట్లతో నిండిన కొండలని అర్థం. అష్టా దశ పురాణాల్లోని బ్రహ్మ వైవర్తక పురాణంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. పూర్వం చతుర్ముఖుడైన బ్రహ్మ సరస్వతీ సమేతుడై ఈ నింబాచల క్షేత్రంలో వంద సంవత్సరాలు తపమాచరించారని పురాణాల ద్వారా తెలుస్తోంది. మండల కేంద్రానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఈ నింబాచల క్షేత్రం ఉంది. ఈ స్థలాన్ని స్వామి వారి మాడ వీధులుగా పిలుస్తారు. కొండకు ఎగువన ఉన్న ద్వితీయార్థంలో రాతి గుహలో స్వామి వారు కొలువు దీరి ఉన్నారు. ఆలయంలో లక్ష్మీ దేవిని స్వామి వారు తన తొడపై కూర్చోబెట్టుకొని కొలువుదీరారు. పక్కన నరనారాయణుల(కృష్ణుడు, అర్జునుడు) విగ్రహాలు ఉన్నాయి. దేశంలో కేవలం బద్రినాథ్‌లో మాత్రమే ఇలా నరనారాయణుల సమేత లక్ష్మీనృసింహుల విగ్రహాలు ఉన్నాయి. దీంతో ఈ క్షేత్రాన్ని దక్షిణ బద్రినాథ్‌గా భక్తులు కొలుస్తారు. ఇక్కడ కొలువైన నృసింహుడు ఉగ్ర రూపంతో కాకుండా ప్రశాంత వదనంతో ఉంటారు. ఉత్సవాల్లో నిత్య పూజలందుకునే స్వామి వారి ఉత్సవ విగ్రహాలు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో ఏడాది పాటు నిత్య పూజలు అందుకుంటాయి.

ఉత్సవాల వివరాలు..

18న గ్రామం నుంచి కొండపైకి ఉత్సవమూర్తుల తరలింపు, 19న క్షీరాభిషేకం, విష్ణు పంచకం, దీపారాధన, రక్షబంధనము, అంకురార్పణం, గరుడపటాదివాసం, ధ్వజారోహణం, 20న నృసింహ ఏకాక్షరిహవనము, 21న స్వామివారి కల్యాణ ఎదుర్కోలు, 22న స్వామి వారి కల్యాణం, 23న నృసింహ ఏకాక్షరిహవనం, గీతాహవనం, గరుడ సేవ, 24న తులసీ వివాహం, కొండ ప్రదిక్షిణం, 25న వైకుంఠ చతుర్దశి, శ్రీ నృసింహ పూజ, దాత్రిహవనం, డోలారోహణం, 26న చతుర్దశి ఉపరి పౌర్ణిమ, రథోత్సవం, జాతర, శ్రీవారి రథ భ్రమణం, 27న శేషహోమం, శ్రీవారికి స్నపన తిరుమంజనం, చక్ర తీర్థం, పూర్ణాహుతి, పుష్పయాగము, 28న దేవతోద్వాసనం, ధ్వజావరోహణం, ఉద్వాసన బలి ప్రదానం, కొండబలి, పుష్కరిణిపై డోలోత్సవం, అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ప్రజలు ప్రలోభాలకు గురికావొద్దు



బిచ్కుందలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బిచ్కుంద/ సదాశివనగర్‌: ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బిచ్కుందలో గురువారం పోలీసు కవాత్తు నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించి ప్రచారం చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌ బూత్‌లలో వికలాంగులు, వృద్ధులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కవాతులో సాయుధ బలగాల అధికారి మనోజ్‌ కుమార్‌, సీఐ కృష్ణ, ఎస్సైలు మురళి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు. సదాశివనగర్‌ మండల కేంద్రంలో పోలీస్‌ కవాత్‌ నిర్వహించారు. శాంతిభద్రతల నేపథ్యంలో కవాతు నిర్వహించినట్లు సీఐ రామన్‌ తెలిపారు. కవాతులో డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్సై రాజు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్‌

నిజామాబాద్‌నాగారం: జిల్లా స్థాయి బాల,బాలికల ఖోఖో టోర్నమెంట్‌ను ఈ నెల 20న నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్‌ చైర్మన్‌ అనిల్‌ గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1న జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ వెంట పదో తరగతి మెమో, వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్‌ కార్డు, బోనాఫైడ్‌, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల వివరాలను శనివారం సాయంత్రంలోగా 8555996271, 7396541233 నంబర్లకు సమాచారం అందించాలని అసోసియేషన్‌ అధ్యక్షుడు భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి అతీకుల్ల కోరారు.

2 వరకు టెన్త్‌ పరీక్ష ఫీజుకు గడువు

- డీఈవో దుర్గాప్రసాద్‌

ఖలీల్‌వాడి : డిసెంబర్‌ 2 వరకు టెన్త్‌ పరీక్ష ఫీ జుకు గడువు పొడగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు గమనించాలన్నారు. ఆలస్య రుసుము రూ.750తో పాటు అదనంగా రూ. 200 డి సెంబర్‌ 12 వరకు చెల్లించవచ్చన్నారు. అలా గే డిసెంబర్‌ 21 వరకు రూ. 7500/–తో 2024 జనవరి 3వ వరకు ఫీజు చెల్లించేందు కు అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎంలు, విద్యార్థులు www. bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఈసారి యుడైస్‌ ప్లస్‌ నుంచి ఎన్‌ఆర్‌ జనరేట్‌ అవుతుందని, స్కూల్‌ లాగిన్‌ నుంచి చలానా జనరేట్‌ తర్వాతే ఫీజు చెల్లించాలన్నారు.

'ఫీజులను నియంత్రించాలి'



కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి డిగ్రీ కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌ కృష్ణ ఆరోపించారు. ఫీజులను నియంత్రించాలని డిమాండ్‌ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కళాశాల వద్ద ధర్నా చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. నిబంధనల మేరకు ఫీజులు తీసుకుంటామని ప్రిన్సిపాల్‌ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రోహిత్‌, నాయకులు ఖలీల్‌, మురళీకృష్ణ, రాకేష్‌, లిఖిత్‌, తదితరులు పాల్గొన్నారు.

'పోలింగ్‌ బృందాల పాత్ర కీలకం'



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్‌ పాటిల్‌

కామారెడ్డి క్రైం: పోలింగ్‌ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్‌ బృందాల పాత్ర కీలకమని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మాస్టర్‌ ట్రైనీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21, 22 తేదీలలో ప్రిసైడింగ్‌, సహాయ ప్రిసైడింగ్‌ అధికారులకు ఆయా నియోజకవర్గ స్థాయిలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల నిర్వహణ, మాక్‌ పోలింగ్‌ తదితర అంశాలపై రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. పోలింగ్‌పై సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు సహకారం అందించేందుకు పోలింగ్‌ బూత్‌ సమీపంలో ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మిషన్లలో సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే సెక్టోరల్‌ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి పోలింగ్‌ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్‌ అధికారి, ఒక సహాయ ప్రైసెడింగ్‌ అధికారి, ఇద్దరు పోలింగ్‌ సిబ్బంది ఉంటారన్నారు. ఈ నెల 23, 24 తేదీలలో అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులను బ్యాలెట్‌ యూనిట్లలో నమోదు చేస్తామన్నారు.

కంట్రోల్‌ రూం సందర్శన

కంట్రోల్‌ రూంను కలెక్టర్‌ పాటిల్‌ సందర్శించి సి–విజిల్‌ యాప్‌, 1950 ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ఎపిక్‌ కార్డులు, ఓటరు జాబితా, ఉలంఘనలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను వేర్వేరుగా నమోదు చేయాలని సూచించారు. సి–విజిల్‌ యాప్‌ ద్వారా ఫ్లయింగ్‌స్క్వాడ్‌, స్టాటిస్టిక్‌ సర్వైలెన్స్‌ బృందాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్‌ అధికారులు రఘునందన్‌, సతీష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

సాయం చేసేందుకు వెళ్లి మృతి



కుమ్మరి ముత్తెన్న (ఫైల్‌)



బోల్తాకొట్టిన ట్రాక్టర్‌

మాక్లూర్‌: సాయం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ట్రాక్టర్‌ ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని కల్లెడి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ముత్తెన్న(49) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సొంతె భూమన్న తన పొలంలో ఇసుక తేలడంతో దానిని గుత్పకు చెందిన అశోక్‌కు విక్రయించాడు. ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్‌ చేసుకొని అశోక్‌ తన డ్రైవర్‌ సూర దేవన్నతో కలిసి వెళ్తుండగా పొలం గట్టు ఎత్తుగా ఉండడంతో దిగబడింది. దీంతో సహాయం కోసం సమీపంలో పొలం దుక్కి దున్నుతున్న కుమ్మరి ముత్తెన్నను పిలిచారు. ట్రాక్టర్‌ను తీసే క్రమంలో ఇంజన్‌ తలక్రిందులైంది. దీంతో ముత్తెన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

మోపాల్‌: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన ఏనుగు లత అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్‌ గురువారం తెలిపారు. లతకు గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేదన్నారు. ఈనెల 14న మందులు తీసుకొస్తానని గల్ఫ్‌లో ఉన్న భర్తకు ఫోన్‌లో సమాచారమిచ్చి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. లత అన్న శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



గుర్జాల్‌ తండాలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

గాంధారి: మండలంలోని గుర్జాల్‌ తండాలో దాడి చేసి అక్రమంగా దాచి ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్‌ తెలిపారు. 17 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రలోభాలకు కళ్లెం

- జిల్లాకు నలుగురు ఎన్నికల అబ్జర్వర్లు
- నియమించిన కేంద్ర ఎన్నికల కమిషన్‌
- ఎన్నికల తీరుపై పరిశీలన
- అధికారులు, బృందాల పనితీరుపై నిరంతర నిఘా

కామారెడ్డి క్రైం: అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించి తప్పిదాలు జరుగకుండా నిరంతర నిఘా ఉండేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఇందుకోసం జిల్లాకు నలుగురు ఎన్నికల పరిశీలకులను నియమించింది. వీరు ఇప్పటికే జిల్లాకు చేరుకుని విధుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాకు ఒక వ్యయ పరిశీలకుడు, ఒక పోలీసు పరిశీలకుడు, ఎల్లారెడ్డికి ఒకరు, కామారెడ్డి, జుక్కల్‌ నియోజకవర్గాలకు కలిపి ఒక సాధారణ ఎన్నికల పరిశీలకులు వచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి అంశంపై వారి ప్రత్యేక నిఘా ఉంటుంది.

పకడ్బందీగా నిఘా..

జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకుడిగా పరా శివమూర్తి, పోలీస్‌ పరిశీలకుడిగా అబ్దుల్‌ ఖయ్యూం, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సాధారణ ఎన్నికల పరిశీలకుడిగా జగదీశ్‌, కామారెడ్డి, జుక్కల్‌ అసెంబ్లీ నియోజకవర్గాలకు అర్జుర్‌ వర్ప్యాయాలు నియమితులైన విషయం తెలిసిందే. పరిశీలకులకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల్లో బస ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించిన అని వ్యవహారాలపై పరిశీలకులు నిఘా, ఎప్పటికప్పుడు తనిఖీలు, నివేదికలు ఉండబోతున్నాయి.

వారేం చేస్తారంటే..

ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌ ఆధ్వర్యంలో 17 రకాల కమిటీలను వేశారు. నోడల్‌ అధికారులను కమిటీలకు ఇన్‌చార్జిలుగా నియమించారు. ఆయా కమిటీలు వారికి కేటాయించిన విభాగాలకు సంబంధించిన ఎన్నికల పనులు చూస్తున్నాయి. ఆయా కమిటీలు, ఎన్నికల అధికారుల పనితీరు, జిల్లాలో ఎన్నికల నిర్వహణ, మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ అమలు తీరులను, ఎన్నికల ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది కేటాయింపు, శాంతిభద్రతల పర్యవేక్షణ విషయాలను ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా సమాచారాన్ని అందజేస్తారు.

జనరల్‌ అబ్జర్వర్‌..

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్‌ నుంచి కౌంటింగ్‌ వరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని వ్యవహారాలు చూస్తారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి సక్రమంగా అమలు జరుగుతుందా లేదా అని పరిశీలిస్తారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిపై ఎన్నికల సంఘానికి నివేదిస్తారు.

వ్యయ పరిశీలకులు..

అభ్యర్థుల రోజువారి ఎన్నికల ప్రచారం, కార్యక్రమాలను పరిశీలించి ఖర్చులు అంచనా వేస్తారు. జిల్లాస్థాయిలో నోడల్‌ అధికారుల ఆధ్వర్యంలో ఉన్న వ్యయ పరిశీలన కమిటీ ఏ విధంగా పనిచేస్తుందో గమనిస్తారు. ధరలను బట్టి అభ్యర్థుల ఖర్చు సక్రమంగా నమోదు చేస్తున్నది, లేనిది పరిశీలిస్తారు.

పోలీసు అబ్జర్వర్‌..

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేపట్టాల్సిన చర్యలపై జిల్లా అధికారులకు సూచనలు అందజేస్తారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించడం, తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. తనిఖీలు, భద్రత పరమైన చర్యల్లో ఎలాంటి తప్పిదాలు జరిగినా చర్యలు తీసుకుంటారు.